క్లుప్తంగా

ప్రజారోగ్యమే ధ్యేయం



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంపీ రాములు

కల్వకుర్తి: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పి.రాములు అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ ఆయా మండలాల నాయకులు ఉన్నారు.

కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్లు

తలకొండపల్లి: మండల పరిధిలోని 14 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీపీ, నిర్మల, ఎంపీడీఓ శ్రీకాంత్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, కార్యదర్శి రాఘవేందర్, జ్యోతయ్య పాల్గొన్నారు.

రేపు రైతాంగ పోరాట వార్షికోత్సవాలు



ఆమనగల్లులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నేత కానుగుల వెంకటయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందుకురు జగన్, శివశంకర్, శివ, లాలునాయక్, పెంటయ్య, వినోద్ తదితరుల పాల్గొన్నారు.

యువ ఇంజనీర్లకు ఆదర్శం 'మోక్షగుండం'



మాట్లాడుతున్న డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి

ఇబ్రహీంపట్నం రూరల్: యుత ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని జెఎన్‌టీయూ సీనియర్ ప్రొపెసర్ డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి అన్నారు. ఎంపీపటేల్‌గూడ సమీపంలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.లక్ష్మినారాయణ, వైస్ చైర్మన్ రాములు, కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉత్తమ ఉపాధ్యాయినులతో సిబ్బంది, విద్యార్థులు

కడ్తాల్: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని నోడల్ అధికారి జంగయ్య అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న హెచ్ఎం విజయ, బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుశీలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అన్నింటికన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని తెలిపారు. పీఆర్టీయూ నాయకులు పద్మావతి, ధనంజయ్‌గౌడ్, హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు క్రాంతికుమార్, శైలజ,స్వరూపరాణి,రోహిణిలత, జ్యోతిర్మయి, కౌసల్య పాల్గొన్నారు.

మంచాల పీఎస్‌ను సందర్శించిన సీపీ

ఇబ్రహీంపట్నం: మంచాల పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పీఎస్‌లోని రికార్డులను పరిశీలించారు. అతనితోపాటు మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ ఉన్నారు.

రైతుల ప్రాణాలకు విలువ లేదా?

- వెంచర్లలో రాత్రికి రాత్రే కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు
- వ్యవసాయ పొలాల్లో ప్రమాదకర స్తంభాలను పట్టించుకోవడం లేదు
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల మండిపాటు
- కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని అభ్యర్థన



విద్యుత్ సమస్యలపై ఏఈ సందీప్‌కుమార్‌ను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

యాచారం: 'లంచాలు వచ్చే వెంచర్లలో రాత్రికి రాత్రే స్తంభాలు పాతి వైర్లు బిగిస్తరు.. కానీ పొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను పట్టించుకోరు'.. అని పలువురు ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, మాల్ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, పెద్దయ్య, కవిత తదితరులు విద్యుత్ సమస్యలపై గళమెత్తారు. తమ గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద కరెంటు వైర్లు చేతికందే ఎత్తులోనే ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం పాతిన స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. లక్షల రూపాయల లంచాలు ఇచ్చే వెంచర్లలో క్షణాల మీద పనులు జరుగుతున్నాయన్నారు. రైతుల ప్రాణాలకు విలువ లేదా అని ఏఈ సందీప్ కుమార్‌ను నిలదీశారు. విద్యుత్ సమస్యలపై ఏళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులో రెండు రోజులు జాప్యం జరిగినా కనెక్షన్ కట్ చేస్తున్నారని, బిల్లు చెల్లించినా.. కరెంటు కలిపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నల్ల వెల్లి, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయని, వెంటనే పరిష్కరించకపోతే విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఏఈ సందీప్‌కుమార్ సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

గ్రామ సభల్లో ఎంపిక చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్ అన్నారు. గృహలక్ష్మి, దళితబంధు తదితర పథకాల అర్హులను ఈ విధానంలో ఎంపిక చేస్తే అసలైన అర్హులకు అందుతాయని ఎంపీపీ కొప్పు సుకన్య అధికారులకు సూచించారు. మంతన్‌గౌరెల్లిలో వడగళ్లు కురిసి వందలాది మంది పేదల ఇళ్లు దెబ్బతిన్నాయని ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్ అనగానే వెంటనే తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి కల్పించుకుని నిధులు మంజూరయ్యాని, త్వరలోనే బాధితులకు చెక్కులు అందజేస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు రావడం లేదని చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని, సరిపడా నీళ్లు రావడం లేదని ఏఈ అనిరుధ్‌పై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది, సమ్మె కాలం వేతనాలు ఇప్పించాలని పంచాయతీ సిబ్బంది ఎంపీపీ, ఎంపీడీఓకు వినతిపత్రాలు అందజేశారు.

ఇంత చులకనా..?

మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాలపై కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ కొప్పు సుకన్య మండిపడ్డారు. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట తప్పిన కేంద్ర ప్రభుత్వం

- పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే
- తలకొండపల్లిలో కొనసాగుతున్న రిలే దీక్షలు



తలకొండపపల్లిలో మాట్లాడుతున్న కిరణ్‌పూలే

తలకొండపల్లి: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 22వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణ, యాదయ్య, శ్రీశైలం, విజయ్, కిరణ్, ప్రహ్లాద్, వంశీ, పోచయ్య, గణేశ్, సందీపు, రమేష్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాల్‌రాం

- పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి
- పీస్ కమిటీ మీటింగ్‌లో ఎస్‌ఐ బల్‌రాం

ఆమనగల్లు: పండుగలను ప్రతిఒక్కరు శాంతియుతంగా జరుపుకోవాలని ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలను ప్రతిష్ఠించేవారు ప్రభుత్వం ఇచ్చిన లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ వైర్ల క్రింద, రోడ్డు మధ్య మండపాలు ఏర్పాటు చేయొద్దని తెలిపారు. లడ్డూల భద్రతను ఉత్సవ కమిటీ సభ్యులే తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్‌లు లక్ష్మణ్, కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, నాయకులు కాలె మల్లయ్య, కండెసాయి, కృష్ణానాయక్, గుర్రం సురేశ్, మహేశ్, రాజు, టిల్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని సమ్మె

- మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్పందించాలని డిమాండ్



ఆదిబట్లలో సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆదిబట్ల మున్సిపల్ సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. వివిధ కేటగిరిల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. ముప్పై ఏళ్లుగా జీతం పెంచకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పందించాలని కోరారు. సిబ్బంది రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, నరేందర్, పర్వతాలు, మల్లికార్జున్, యాదగిరి, విజయ్, ఉపేందర్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

సానుకూలంగా స్పందించాలి

అబ్దుల్లాపూర్‌మెట్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది మున్సిపల్ కార్యాలయం ముందు శాంతియుత సమ్మె నిర్వహించారు. ప్రభుత్వం తమ విషయంపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

'భేరి'ని జయప్రదం చేయండి

- సోనియా సభకు వేలాదిగా తరలిరావాలి
- పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: విజయభేరి సభను జయప్రదం చేయాలని చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెద్దఅంబర్‌పేటలోని ఇందిరాగార్డెన్స్‌లో శుక్రవారం పార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాతుడూ.. సభకు పెద్దసంఖ్యలో జనాన్ని తరలిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు చర్లపల్లి శంకరయ్యగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చామ విజయశేఖర్‌రెడ్డి , కౌన్సిలర్లు పసుల రాజేందర్ ముదిరాజ్ నాయకులు మజ్జిగ లక్ష్మారెడ్డి, పండుగల రాజు, సురేష్, దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, పంది పెంటయ్య, సంజీవ, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి కాంగ్రెస్‌దే అధికారం

కడ్తాల్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, ప్రజల ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మక్తమాధారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మక్తమాధారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నారాయణగౌడ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన పార్టీని ఆదరించాలని కోరారు. ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షులు బాల్‌రాజ్,నాయకులు ఆశోక్, ఇక్బాల్, రాంచంద్రయ్య, రామలింగం,షాబుద్దీన్, యాదయ్య, రమేశ్, సురేశ్, శ్రీరాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

సోనియా రుణం తీర్చుకుందాం

తలకొండపల్లి: ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఏఐసీసీ ప్రముఖులు హాజరు కానున్న సభకు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు రవీందర్‌యాదవ్, అంజయ్యగుప్తా, మాజీ ఎంపీటీసీ రాములు, అసెంబ్లీ సోషల్ మీడియా ఇంచార్జ్ అజీం, యూత కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు డిగ్రీ కృష్ణయ్య, రమేశ్, శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వైభవం ఖాయం

యాచారం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నందివనపర్తిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్యుల సమావేశం జరిగింది. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. సోనియా సభకు వేలాదిగా కదలాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు మంకాల దాసు, లక్ష్మీపతిగౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీపీ సర్పంచ్‌లకు సన్మానం



లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



కలెక్టర్ కార్యాలయంలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లలితాజ్యోతయ్య

కడ్తాల్: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్- 2023 అవార్డుల్లో భాగంగా, జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఆర్డీవో ప్రభాకర్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు సర్పంచ్‌ను అభినందించారు.

తలకొండపల్లి సర్పంచ్‌కు సన్మానం

తలకొండపల్లి: గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికై న తలకొండపల్లి సర్పంచ్ లలితాజ్యోతయ్యను ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, కార్యదర్శి రాఘవేందర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, కడ్తాల్ సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, జ్యోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తుర్కయంజాల్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబాలు ఎదుగుతాయని ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆల్ ఇండియా హెచ్ఆర్. అర్పిత భట్టాచార్య అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని షైన్ స్వచ్ఛంద సంస్థ, ఎయిర్ వాటర్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నయి దిశ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దీనిద్వారా మహిళలకు అనేక అంశాల్లో శిక్షణను అందజేయనున్నామని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. అనంతరం శిక్షణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పరమేశ్వరి, ప్రతినిధులు జయరామ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న పరమేశ్

కడ్తాల్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లాకు త్వరలోనే సాగు, తాగునీరు అందనుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నార్లాపూర్ సమీపంలో లిఫ్ట్-1 ట్రయల్ రన్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం నిర్వహించే సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'ఐక్యత' చేయూత



ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: విఠాయిపల్లికి చెందిన మదనాపురం మంగమ్మ ఇంటి నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ సాయం అందించింది. గ్రామానికి చెందిన మదనాపురం వెంకటయ్య రెండు నెలల క్రితం ఆకస్మికంగా మృతిచెందాడు. ఇతనికి భార్య మంగమ్మతో పాటు ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. శుక్రవారం ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతాలు, నాయకులు శ్రీధర్‌నాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యులు వస్పుల సాయిలు, మల్లేశ్‌నాయక్ అన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై ఆమనగల్లు ఎంపీపీ అనిత చేసిన విమర్శలను ఖండించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీలో లేనివారిని పక్కన కూర్చోబెట్టుకుని ఎంపీపీ అనిత.. బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చాలని ఎలా కోరుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జంతుక కిరణ్, వడ్డె వెంకటేశ్, భాస్కర్, జంగయ్య, దేవేందర్, శేఖర్, గణేశ్, భీమయ్య, కాలె విక్రం, రంజిత్, ప్రసాద్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని చేప పిల్లలు వద్దు

- మత్స్య కార్మికుల సంఘం నేతల ఆందోళన
- చేప విత్తనం పంపిణీలో గోల్‌మాల్ జరుగుతోందని ఆగ్రహం



జిల్లా అధికారి సుకీర్తితో మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: నాణ్యత లేని చేప పిల్లలు వద్దని మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మ నినదించారు. శేరిగూడలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద ఆ శాఖ జిల్లా అధికారి సుకీర్తి, సూపరింటెండెంట్ రమేశ్‌తో శుక్రవారం మత్స్యకారులు వాగ్వాదానికి దిగారు. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇబ్రహీంపట్నం చెరువులో 3 అంగుళాల చేప పిల్లలను వదిలారని.. ఇప్పుడు 35 ఎంఎం చేప పిల్లలను పంపిణీ చేస్తారాంటూ అధికారులను నిలదీశారు. ఉచిత చేప పిల్లల టెండర్ల ప్రక్రియలో గోల్‌మాల్ జరుగుతోందని ఆరోపించారు. కంట్రాక్టర్ల ద్వారా పంపిణీ అవుతున్న ఉచిత చేప పిల్లల సైజు ఎక్కువగా పెరగడంలేదన్నారు. నేరుగా సొసైటీల ఆకౌంట్లలో డబ్బులు వేస్తే.. నాణ్యమైన విత్తనం తెచ్చుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి. నర్సింహ్మ, వెంకటేశ్, సురేష్, లక్ష్మణ్, యాగిరి, ప్రసాద్, శ్రీనివాస్, గిరి తదితరులు ఉన్నారు.

వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు



ఆమనగల్లులో మాట్లాడుతున్న అనంతరెడ్డి

ఆమనగల్లు: మండల పరిధిలోని మంగళపల్లి-చెన్నారం మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మంగళపల్లిలో మాట్లాడుతూ.. నిధులు మంజూరు చేయించిన ఎమెల్యే జైపాల్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు శంకర్, మురళి, వెంకటేశ్, తానయ్య, జంగయ్య, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు రాబట్టడంలో విఫలం: బీజేవైఎం

తలకొండపల్లి: మండల కేంద్రానికి ఇటీవల మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక్క అడ్మిషన్ కూడా రాకపోవడం దారుణమని బీజేవైఎం తాలూకా కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి అలుపెరుగని పోరాటం చేయడంతోనే కళాశాల మంజూరైందదని తెలిపారు. కానీ ఈ విషయంపై ప్రచారం కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఓ పురాతన, శిథిల భవనంలో కాలేజీని ప్రారంభించడంతో ఎవరూ రావడం లేదని తెలిపారు.